నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 13, 2024 | www.navatelangana.com

అకాల వర్షంతో మొక్కజొన్న పంటకు నష్టం

నవతెలంగాణ-ముథోల్

ముథోల్‌తో పాటు మండలంలోని చించాల, తరోడ, రాంటెక్, వెంకటాపూర్, ఎడ్‌బిడ్, ఎడ్‌బిడ్ తండా తదితర గ్రామాలలో ఆదివారం రాత్రి అకాల వర్షం కురిసింది. సుమారు 40 నిమిషాల పాటు కురిసిన వర్షానికి మండలంలోని సుమారు 80ఎకరాల వరకు మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి అజ్మీర భాస్కర్ తెలిపారు. సోమవారం వ్యవసాయ శాఖ ఏఈవోలు, ఏవో గ్రామాలలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు.



16న జరిగే కార్మిక, కర్షక దేశవ్యాప్త సమ్మెకు టీఏజీఏస్ మద్దతు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, గిరిజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఏస్) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా మోడీ ప్రభుత్వ హయాంలో ఆదివాసులపై దాడులు, అడవుల ప్రయివేటీకరణ, షెడ్యూల్ ప్రాంతాల ఎత్తివేత, అటవీ చట్టాల నిర్వీర్యం జరిగిందన్నారు. మోడీ ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మెలో రాష్ట్ర వ్యాప్తంగా టీఏజీఏస్ క్యాడర్, గిరిజన ప్రజలు భాగస్వామ్యమై మోడీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పేర్కొన్నారు.

సమస్యల వెల్లువ..పరిష్కారానికి భరోసా..!

- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అధికారులు
- జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మంత్రి హామీ
- సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని అధికారుల భరోసా
- నాగోబా దర్బార్‌కు భారీగా హాజరైన గిరిజనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఇంద్రవెల్లి

ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో సోమవారం నిర్వహించిన నాగోబా దర్బార్‌లో సమస్యలు వెల్లువెత్తాయి. ఉమ్మడి జిల్లాలో ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ ఆదివాసీ తెగలకు చెందిన నాయకులు ఏకరువు పెట్టారు. ఏండ్లుగా దర్బార్ జరుగుతున్నా.. ఆయా సమస్యలు పరిష్కరించాలని అర్జీలు ఇస్తున్నా ఎలాంటి ఉపయోగం ఉండటం లేదని.. అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పునరుద్ఘాటించారు. జిల్లాలోని తొమ్మిది తెగలకు చెందిన నాయకులు లేవనెత్తిన సమస్యలను ఓపిగ్గా విన్న మంత్రి సీతక్క వాటి పరిష్కారానికి భరోసా ఇచ్చారు. తాను గిరిజన బిడ్డనేనని.. అడవి బిడ్డల కష్టాలు తెలుసని ఉమ్మడి జిల్లా సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ జిల్లాతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని ఇన్‌ఛార్జి మంత్రిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. జిల్లాకు నిరంతరం వస్తానని.. ఇప్పటికే నా దృష్టికి వచ్చిన వివిధ రకాల సమస్యలను అధికారులతో పరిష్కరించేలా చేశానని గుర్తు చేశారు. దర్బార్‌లో వచ్చిన అర్జీలను కచ్చితంగా పరిష్కరించేలా శాయశక్తులా కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులకు సైతం పలు సూచనలు చేశారు. ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను చిత్తశుద్ధితో..కష్టాన్ని ఇష్టంగా భావించి పరిష్కరిస్తూ పనిచేస్తే వారు కృతజ్ఞతభావంతో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలను తెలిపేలా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి.

ఆదివాసుల అభివృద్ధికి కృషి చేయాలి : సోయం బాపురావు, పార్లమెంటు సభ్యుడు

గత ప్రభుత్వంలో ఎలాంటి సమస్యలు పరిష్కారం కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కపై నమ్మకం ఉంచి ఇక్కడ కాంగ్రెస్‌ను గెలిపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే గిరిజనులకు పోడు పట్టాలిచ్చింది. రాష్ట్రంలో 2లక్షల మందికి పోడుపట్టాలందించాలి. జీఓ నెం.3ని అమలు చేయాలి. ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారానైనా కొనసాగించేందుకు అవకాశం ఉంది. ఆదివాసీ పిల్లలకు



ఉన్నత విద్య అవకాశాలు కల్పించాలి. చట్టబద్ధత లేని కులాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఇది వరకే ప్రధానమంత్రి, రాష్ట్రపతికి విన్నవించాం. కేంద్రం పీవీటీజీల అభివృద్ధి కోసం జన్‌మన్‌యోజన పథకం తీసుకొచ్చింది. మిగితా రాష్ట్రాల మాదిరిగానే ఇక్కడా వందన యోజన పథకాన్ని అమలు చేయాలి. ఆదివాసులను బీఆర్ఎస్ మోసం చేసినట్లు..కాంగ్రెస్ చేయదనే విశ్వాసం ఉంది. అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుంది.

సమస్యల పరిష్కారానికి కృషి : వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్యే, ఖానాపూర్

ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుంది. తాగునీటి సమస్య తీర్చేందుకు ప్రభుత్వం రూ.60కోట్లు మంజూరు చేసింది. గురుకులాల కోసం మరో రూ.10కోట్లు కేటాయించింది. ఇక్కడ నర్సింగ్ కళాశాల ఏర్పాటుచేయాలి. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలు 15 మందిని గుర్తించి నిధులు కేటాయించామని..మిగితా వారిని కూడా గుర్తించి ఆదుకుంటాం. కేస్లాపూర్‌కు డబుల్‌రోడ్, సెంట్రల్‌లైటింగ్ కోసం నిధులు కేటాయించాం. ఆదిలాబాద్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలి. ఇప్పటికే రోడ్ల కోసం రూ.8కోట్లు కేటాయించిందని, చిక్‌మాన్ ప్రాజెక్టు, చెక్‌డ్యామ్‌లు పూర్తిచేయాలి. జీఓ 46తోపాటు 317 జీఓ ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను దూరం చేయాలి. జిల్లాను దత్తత తీసుకున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

ప్రమాణాలు మెరుగుపరుస్తాం : రాహుల్‌రాజ్, జిల్లా కలెక్టర్

ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో విద్యా, వైద్యం, వ్యవసాయం, ఉపాధి కల్పన, రోడ్ల నిర్మాణ తదితర మౌళిక వసతులు కల్పించేందుకు కృషిచేస్తాం. విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు మరింత నాణ్యమైన వైద్యం అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. 400 ఆవాస ప్రాంతాలకు త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పిస్తున్నాం. గ్రామాల్లో కనెక్టివిటీ రోడ్ల నిర్మాణంపై దృష్టిసారిస్తున్నాం. ఐటీడీఏ ద్వారా అమలవుతున్న పథకాలు అర్హులకు అందజేస్తాం. దర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తాం.

ప్రజల కోసమే పోలీసులు పనిచేస్తున్నారు : గౌస్ ఆలం, జిల్లా ఎస్పీ

నాగోబా జాతరకు అవసరమైన బందోబస్తు ఏర్పాటుచేశాం. సుమారు 500మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడకు వచ్చిన తర్వాత చాలా మందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నాను. పోలీసులు ప్రజలతో స్నేహపూరితంగా మెలుగుతూ వారి సంక్షేమం కోసమే పనిచేస్తున్నారు. పోలీసుశాఖ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేలా కృషిచేస్తాను.

విద్యా, వైద్యానికి ప్రాధాన్యం : ఖుష్బు గుప్తా, ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీఓ

తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర నాగోబా. ఇప్పటికే ముఖ్యమంత్రి రూ.6కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ జాతరకు ఐటీడీఏ ద్వారా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఈ ప్రాంతంలో విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఐటీడీఏ ద్వారా యువతకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టి ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషిచేస్తాం.





ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- టీ-హాబ్ కేంద్ర ప్రారంభంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో టీ-హబ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. టీ హబ్ కేంద్రం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షలు చికిత్సల నిమిత్తం మంజూరు చేస్తుందని తెలిపారు. ఆసుపత్రిలలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటిడిఎ పిఓ కుష్బు గుప్తా, ఎంపీపీ, జడ్పీటీసీ, ఇతర ప్రజాప్రతినిధులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

- గిరిజన యూనివర్సిటీ నెలకొల్పాలి
- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యా రంగ బడ్జెట్ కేటాయింపులను సవరించి అధిక నిధులు కేటాయించాలనీ పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో నిర్వహించిన జిల్లా సమావేశానికి హాజరై మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యను సంక్షోభంలోకి నెట్టిందని, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైన పునరాలోచన చేసి రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కానీ ఇందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ నిధులు కేటాయించడం బాధాకరమన్నారు. అదే విధంగా గత పాలకులు ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీని నెలకొల్పుతామని ప్రకటించి ఇక్కడి ఆదివాసీ గిరిజనులను మోసం చేసిందని ఆరోపించారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో గిరిజన యూనివర్సిటీని నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో విద్యారంగం సంక్షోభంలో ఉందని, దీన్ని మెరుగ్గా మార్చాలని అన్నారు. కార్యక్రమంలో ఎబికెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రాజు, పీడీఎస్‌యూ నాయకులు ఎర్రోజు హరీష్, మడావి గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, పిఓడబ్ల్యు జిల్లా కన్వీనర్ కళావతి, వివిధ మండలాల నుండి హాజరైన విద్యార్థి ప్రతినిధులు నాగేందర్, దీపమాల, గిరిజ, దత్తు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ బదిలీల జాతర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మళ్లీ ఎన్నికల బదిలీల పర్వం మొదలైంది. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో భారీగా ట్రాన్స్‌ఫర్లు కాగా, ఇప్పుడు లోకసభ ఎన్నికల నేపథ్యంలో కసరత్తు ప్రారంభమైంది. జిల్లాలో మూడేళ్లకుపైగా విధులు నిర్వర్తించిన అధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో బదిలీలు కొనసాగుతున్నాయి.

జడ్పీ సీఈఓగా రత్నమాల

రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్ సీఈఓలను బదిలీ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా సీఈఓగా ఉన్న రత్నామాలను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడి సీఈఓ గణపతిని మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు. డీఎల్పీఓలను సైతం బదిలీ చేశారు. ఆదిలాబాద్ డీఎల్పీఓగా ఫణిందర్‌రావు, ఉట్నూర్ డీఎల్పీఓగా ప్రభాకర్‌రావు రానున్నారు. ఇక్కడ పని చేసిన డీఎల్పీఓ దాడే ధర్మరాణి, ఉట్నూర్ డీఎల్పీఓ బొమ్మ భిక్షపతిలను మంచిర్యాల జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

డీఆర్డీఓ కిషన్ బదిలీ

బదిలీల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ డిఆర్డిఓగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.కిషన్‌ను మంచిర్యాల జిల్లా డిఆర్డిఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కామారెడ్డి డిఆర్డిఓగా కొనసాగుతున్న జి. సాయన్న ఇక్కడికి రానున్నారు.

నేడు ఆశ్రమ పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ సైన్సు దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయిలో పెయింటింగ్, కవితలు, పాటలు, ఉపన్యాస పోటీలను ఈ నెల 13న పట్టణంలోని ప్రభుత్వ కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు సైన్స్ అధికారి రఘు రమణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి, ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా, డిప్యూటీ డైరెక్టర్ దిలీప్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత హాజరవుతారని పేర్కొన్నారు. పోటీల అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతుల ప్రదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో హమాలీలు పాల్గొనాలి

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మిక హక్కుల సాధన, చట్టాల పునరుద్ధరణకు ఫిబ్రవరి 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బేవరేజ్ కార్పొరేషన్ హమాలీల జిల్లా సమావేశానికి హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక రైతు వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్, కార్మిక సంఘాలు, వివిధ ఉద్యోగ సంఘాలు, అఖిలభారత ఫెడరేషన్లు సంయుక్త కిషన్ మోర్చా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ నిర్ణయంలో భాగంగా బేవరేజ్ హమాలీ కార్మికులు కూడా సమ్మెలో భాగస్వాములు కావాలని తెలంగాణ హమాలీ యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఎస్ఎంఆర్, ఫిక్స్ డ్-పే కార్మికులను పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల నుండే ప్రతినెల వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. 11వ పిఆర్‌సి కమిషన్ చైర్మన్ సిఫారసు చేసిన వేతనాలను జీవో నెం.60 ప్రకారం కార్మికులకు కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే కార్మికుల ఖాతాల్లో వేయాలన్నారు. పెండింగ్ పీఎఫ్, ఏరియర్ డబ్బులను కార్మికుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని, ఆదివారాలు, పండుగ సెలవులు, 8గంటల పని దినాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. దీన్ని వాటర్ వర్క్స్ కార్మికులకు కూడా వర్తింపజేయాలన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యుల సస్పెన్షన్‌ను ఖండించిన రిమ్స్ వైద్యులు

- నల్ల బ్యాడ్జీలతో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగిని ఎలుకలు కొరికిన ఘటనలో ఇద్దరు వైద్యులను విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ రిమ్స్ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో షేక్ ముజీబ్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో చికిత్స పొందుతున్నాడు. రక్తపోటు సంబంధిత సమస్యలతో వారం రోజులుగా ఐసీయూలో ఉంటున్న రోగి చేతులు, కాళ్లపై ఎలుకలు కొరికి తీవ్రంగా గాయపరిచాయి. ఇతర రోగులు ఆసుపత్రిలో ఎలుకల బెడద గురించి ఫిర్యాదు చేశారు. దీంతో ఆసుపత్రి అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఐసీయూ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ వసంత్ కుమార్, కావ్యతో పాటు నర్సింగ్ ఆఫీసర్ మంజులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రోగిని ఎలుకలు కొరికిన ఘటనకు బాధ్యత పారిశుధ్య ఏజెన్సీ అయినప్పుడు వైద్యులను ఎలా సస్పెన్షన్ చేస్తారని రిమ్స్ వైద్యులు ప్రశ్నించారు. వైద్యుల ప్రమేయం లేకుండా ఈ ఘటన జరుగగా ఎలా సస్పెండ్ చేస్తారన్నారు. వెంటనే వైద్యుల సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఇద్రిస్ అక్బాని, సుమలత, శ్యామ్ ప్రసాద్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల చర్చకు కేసీఆర్ అసెంబ్లీకి రావాలి

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ ఫ్లెక్సీ దహనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ విషయంలో మాజీ సీఎం కేసీఆర్‌కు ఎంత సమయమైనా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తే కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా అన్ని అబద్దాలు చెబుతున్నాడని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ విమర్శించారు. సోమవారం కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. కృష్ణా జలాలపై కేసీఆర్ వైఖరిని ఖండిస్తూ ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. చర్చకు అసెంబ్లీకి రాకుండా నల్గొండ సభ ఏర్పాటు ప్రజలను తప్పుదోవ పట్టించడానికేనని ఆరోపించారు. ఇంకా ఎన్ని అబద్దాలు చెప్పి ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. కృష్ణా జలాల పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందే కేసీఆర్ అని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ప్రాజెక్టులకు కేసీఆర్ చేసిందేమీ లేదని, మరిప్పుడు ఏ ముఖం పెట్టుకొని నల్గొండ సభ పెడుతున్నారని



ఆయన ప్రశ్నించారు. తమది నిబద్ధతతో పని చేసే ప్రభుత్వమని, చక్కటి ప్రజాపాలన సాగుతుంటే చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మల్లేష్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, యాల్ల పోతారెడ్డి, మైనారిటీ నాయకులు షకీల్, రషీద్ ఉల్ హక్, రఫీక్, చారి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్రజ టౌన్ షిప్ నిర్మాణ పనుల పరిశీలన



ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని అగ్రజా టౌన్‌షిప్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన రాజీవ్ స్వగృహదారులు సోమవారం సమావేశమయ్యారు. టౌన్‌షిప్ పక్కన గల ఐటీ టవర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో సమావేశమై కొనసాగుతున్న మౌలిక వసతుల పనులను పరిశీలించారు. అనంతరం పలు సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు నిర్ణయించారు.

అగ్రజ టౌన్‌షిప్ కమిటీ ఎన్నిక

అగ్రజ టౌన్ షిప్‌లో మౌలిక వసతుల పనులు త్వరితగతిన చేపట్టి సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా వెంకట్‌రెడ్డి, అధ్యక్షులుగా సంతోష్ దేవదర్శన్, ఉపాధ్యక్షుడుగా శ్రీనివాస్, రాంకిషన్, సంయుక్త కార్యదర్శులుగా భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, రామ్, మహేందర్‌రెడ్డి, మల్లేష్ ఎన్నికయ్యారు. ఈ కమిటీ కాంట్రాక్టర్ చేపట్టే పనులను పర్యవేక్షిస్తుందని, అవకతవకలు జరిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి : అక్రమ కలప పట్టివేత

నవతెలంగాణ-బోథ్



అక్రమంగా నిల్వ ఉంచిన కలపను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన నవ్వ శ్రీనివాస్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆదిలాబాద్ టాస్క్ ఫోర్స్ రేంజ్ అధికారి వాహబ్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం...నవ్వ శ్రీనివాస్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ టేకు దుంగల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. బాధితుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే జిల్లాల్లో ఎవరైనా అక్రమంగా కలప నిల్వ ఉంచినా, తరలించినా శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాడుల్లో టాస్క్ ఫోర్స్ అధికారులు గులాబ్ సింగ్, సజన్‌లాల్, ప్రవీణ్, శ్యాంసుందర్ ఉన్నారు.

ఫారెస్ట్ సెక్షన్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని మౌలానా నగర్ గ్రామానికి చెందిన షేక్ అలిమోద్దీన్ అనే రైతు సోమవారం మండల అటవీ శాఖ సెక్షన్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా ఫిర్యాదుల విభాగంలో జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ అలిమోద్దీన్ మాట్లాడారు. గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమిపై అటవీ శాఖ సెక్షన్ అధికారి కొటేష్, వ్యవసాయ పనుల వద్దకు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు. వ్యవసాయ పనులు చేసుకునేందుకు ట్రాక్టర్ తీసుకువెళ్లేటపుడు ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఈనెల 7న బైంసా అటవీశాఖ డివిజన్ అధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. అనంతరం సోమవారం అదనపు కలెక్టర్, జిల్లా అటవీశాఖ అధికారులకు వేరువేరుగా ఫిర్యాదులు చేశామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని కోరారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-జైనథ్

మతిస్థిమితం లేక ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మడావి వైశాలి(29) మతిస్థిమితం లేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గత కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి, ఆస్పత్రుల చుట్టూ తిరిగిన మెరుగుకాలేదు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఘనంగా మార్కండేయ జయంతి

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని చించాల గ్రామంలో సోమవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు బసవరాజు ఆధ్వర్యంలో చించాల ఆలయంలో యజ్ఞం నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వివరాలను తప్పుల్లేకుండా పూరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పూరించి ఇవ్వాలని ఆర్డీఓ స్రవంతి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. పాటించే సూత్రలు, విధులు, అందించాల్సిన పత్రాలు తదితర వాటిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉద్యోగులు వారి వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పూరించి ఇవ్వాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పెండింగ్‌లో లేకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ ఓ రమేష్ రాథోడ్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతి

- గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు
- దిక్కుతోచని స్థితిలో కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని రాజులగూడ గ్రామానికి చెందిన ఆడే ప్రవీణ్ గ్రేహౌండ్ కానిస్టేబుల్‌గా జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ ఆదివారం రాత్రి విద్యుద్ఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో గ్రామంలో వారి కుటుంబంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. స్థానిక మాజీ సర్పంచ్ సావీందర్ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం... ఆడే ప్రవీణ్ కష్టపడి చదివి 2012 బ్యాచ్‌లో 15 బెటాలియన్‌లో ఉద్యోగం సాధించాడు. రెండేండ్ల క్రితమే తండ్రి అనంతా అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరు అన్నదమ్ముల్లో ఈయన ఉద్యోగం చేస్తూ, ఇటు తల్లి, తమ్ముడు, అటు భార్యతో పాటు ఇద్దరు కొడుకులను



పోషిస్తున్నాడు. భూపాలపల్లి జిల్లాలో గుర్తుతెలియని వ్యక్తులు నస్తురిపల్లి అటవీ ప్రాంతంలో ఆదివారం విధుల్లో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అడవి జంతువుల కోసం పెట్టిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. దీనితో ఆ కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం స్థానిక మాజీ సర్పంచ్ సావీందర్ రాథోడ్ గ్రామ పెద్దలు ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం కారకులైన వారిని కఠినంగా శిక్షించి, కానిస్టేబుల్ ప్రవీణ్ కుటుంబానికి అన్నీ విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రశంసాపత్రం అందుకున్న గోవింద్ నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

కోదాడ నుంచి నడిగూడెం వరకు జరిగిన కవి యాత్రలో ఆదిలాబాద్ జిల్లా నుంచి చవాన్ గోవింద్ నాయక్ పాల్గొని సోమవారం ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. పల్లె పల్లెల్లో తిరిగి కవిత గానం చేసిన ప్రతి ఒక్కరికి శాలువాలతో సన్మానించి, ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హరికృష్ణ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కవి అధ్యక్షుడు సినీ, గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత గాయకుడు నటుడు సాధనాల వెంకట స్వామి నాయుడు పాల్గొన్నారు. గోవింద్ నాయక్ మాట్లాడుతూ నా కవిత్వని, నా కష్టాన్ని గుర్తించి నాకు సన్మానించిన కవులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవి యాత్ర జాతీయ అధ్యక్షుడు కారం శంకర్, ప్రధాన కార్యదర్శి వెంకట్, నిలివేరా సాహిత్య కళా పీఠా అధ్యక్షుడు లింగమూర్తి, కోదాడ రచయితల సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో అడవి జంతువులను వేటాడటానికి, పంటకు రక్షణగా గాని అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడవి జంతువులను వేటాడే క్రమంలో వేటగాళ్లు కరెంటు తీగలను అమర్చడం వల్ల, పంట పొలాలకు రక్షణగా జంతువుల బారిన పడకుండా విద్యుత్ తీగలు అమర్చి క్రమంలో, పంట పొలాలకు వెళ్లే రైతులు, జంతువులు, అటుగా వెళ్లే పోలీసు, ఫారెస్ట్ సిబ్బంది ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వ్యక్తులపై ఐపీసీ 304 నిబంధన 2 ప్రకారం చట్టరీత్యా శిక్షార్హులు వీరికి నేరం రుజువు అయితే 10 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష లేదా, యావజీవకారాగార శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నార్నూర్ మండలానికి సంబంధించిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ఆదివారం కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా కాటారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇలాంటి కరెంటు దుశ్చర్యలకు పాల్పడటం వల్ల మరణించడం శోచనీయమని ఎస్పీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా వచ్చే ప్రతి ఒక్క లబ్ధిని సకాలంలో అందేలా కృషి చేస్తానని తెలియజేశారు. అలాగే జిల్లాలో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడే వారి సమాచారం అందజేయాలని, ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, సమాచారం అందజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు. జిల్లాలోని మావల, గుడిహత్నూర్, బోథ్, తలమడుగు మండలాలలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం వల్ల నలుగురు అమాయకులు మరణించడం జరిగిందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు.

16న గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఈ నెల 16న సింగరేణి సేవా సమితి సహకారంతో మాతా రిసర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథం మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు కీళ్ళ, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, అస్తమా, స్త్రీల వ్యాధులు తదితర వాటికి పరీక్షించి మందులు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు, గోలేటి, మాదారం, బెల్లంపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలపై గళం విప్పిన ఆదివాసీ నాయకులు

- యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జిల్లాలోనే రెండో అతి పెద్ద జాతరగా పేరుగాంచిన కేస్లాపూర్ నాగోబా జాతరలో సోమవారం దర్బార్‌ను నిర్వహించారు. ఈ దర్బార్‌కు మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎంపీ గోడం నగేష్, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జీ పీఓ ఖుష్బు గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసీ 9 తెగల నాయకుల నుంచి ప్రతి ఒక్క సామాజిక సంఘం నుంచి నాయకులు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లా రాయి సెంటర్ సార్మేడి మెస్రం దుర్గు మాట్లాడుతూ ఆదివాసులు నివసిస్తున్న మారుమూల గ్రామాలకు తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. మిగిలిన రైతులకు సైతం పోడు భూములకు పట్టాలు అందించాలని అన్నారు. ఉట్నూర్ మూతపడిన డీఎడ్, పున:ప్రారంభించాలన్నారు. బీఎడ్, కాలేజీలో తగిన, బోధన సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రధాన్ సంఘం నాయకులు మెస్రం ఏక్‌నాథ్ మాట్లాడుతూ 2012 నుంచి ఏజెన్సీలో డీఎస్సీ వేయలేదన్నారు. దర్బారులో ఇచ్చిన అర్జీలు పరిష్కరించడం లేదని మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. కోలామ్ సంఘం నాయకులు ఎంపీటీసీ భీమ్‌రావ్ మాట్లాడుతూ విద్య, వైద్య పరంగా కొలాం తెగ అత్యంత వెనుకబడిన తెగకు ప్రత్యేకాధికారిని నియమించి ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. తోటి, నాయక్‌పోడ్ సంఘం నాయకులు సెడ్మాకి భీమ్‌రావ్, భీముడు మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా స్వయం ఉపాధి కోసం సమర్పించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి రుణాలను అందజేయాలని పేర్కొన్నారు. అంధ్ సంఘం నాయకులు ముఖాడె విష్ణు మాట్లాడుతూ జీఓనెం.3ను పునరుద్ధరించాలని, 317 ను రద్దు చేయాలని అన్నారు. యువతకు ట్రైకార్ ద్వారా స్వయం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కుమురంభీమ్ మనువడు సోనేరావ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గిరిజన సమస్యలను పరిష్కరించడంలో ముందు వరుసలో ఉండాలన్నారు. పోడు భూములకు హక్కులతో పాటు గిరిజన రైతులకు 3 ఫేజ్ కరెంట్, బోరు బావుల సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యోగ సంఘం నాయకులు మెస్రం మనోహర్ మాట్లాడుతూ ఉట్నూర్ మూతపడిన డీఎడ్ కాలేజ్ పున:ప్రారంభించాలని అన్నారు. బీఎడ్ కళాశాలలో బోధన సిబ్బందిని నియమించాలని మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు.

గోండి పాటల సీడీ ఆవిష్కరణ...

గోండి పాటల రచయిత, గాయకుడు వెట్టి యోధన్, రవి రచించిన గోండి పాటల సీడీని మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. దర్బార్‌లో గిరిజన విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గురుకులాల్లో పదేండ్లుగా తలమానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని గురుకులాల ఉపాధ్యాయుల జేఏసీ నాయకులు రవి కోరారు. సోమవారం జేఏసీ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలను ధరించి జిల్లా కేంద్రంలోని బోథ్ గిరిజన డిగ్రీ కళాశాల ఎదుట నల్ల బ్యాడ్జీపు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు రవి మాట్లాడుతూ ఏడేండ్లుగా మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని గురుకులాల్లో ఉపాధ్యాయులు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న రిక్రూట్‌మెంట్ కారణంగా తమకు అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే బదిలీలు చేపట్టాలన్నారు. అన్ని క్యాడర్లలో ప్రమోషన్స్‌ను ఇవ్వాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టే కొత్త నియామకాల కంటే ముందే బదిలీలు, ప్రమోషన్స్ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల సీనియారిటీ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని కళాశాలలకు భవన నిర్మాణాలను చేపట్టాలన్నారు. అన్ని యాజమాన్యాల గురుకులాలను ఒకే గొడుగు కిందకు తీసుకవచ్చి డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయాలని అన్నారు. విద్యార్థుల పాకెట్‌మనీ చార్జీలు పెంచాలని తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముందుగా తమకు బదిలీలు, పదోన్నతులు కల్పించిన తరువాతనే నియమాకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, వైస్ ప్రిన్సిపాల్ శివకృష్ణ, లక్ష్మణ్, అంజలి, శిరీష, బొజ్జు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 13, 2024 | www.navatelangana.com

వేగ నియంత్రణ సూచికల ఏర్పాటు

నవతెలంగాణ-కౌటాల



రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వేగనియంత్రణ సూచికలను ఎస్సై మధూకర్ ఏర్పాటు చేశారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించి వాహనాలను నడిపితే ప్రమాదాలు జరుగకుండా ఉంటాయని ఎస్సై తెలిపారు. మండలంలోని గురుడుపేటలో కౌటాల నుండి బెజ్జూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరుగకుండా డ్రమ్స్‌తో వేగనియంత్రణ సూచికలను ఏర్పాటుచేశారు. రోడ్డు నియమాలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రజలకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

తమ్మినేనిని పరామర్శించిన జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ఖమ్మం జిల్లాలోని తెల్దార్ పల్లెలో గల ఆయన నివాసంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ ఆయనను కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ్మినేని ప్రజా నాయకుడని, త్వరగా కోలుకొని మళ్లీ ప్రజా సమస్యల కోసం పోరాడేందుకు ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహాజన పాదయాత్రలో 4500 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన గొప్ప ప్రజా నాయకుడని కొనియాడారు.

కారోబార్ల కష్టాలు

- చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- జిల్లాలో 325 జీపీల్లో 300లకు పైగా కారోబార్లు



పారిశుధ్య కార్యక్రమాల్లో కారోబార్లు



ప్రభుత్వ పథకాలకు సంబంధించి దరఖాస్తు స్వీకరిస్తున్న కారోబార్లు (ఫైల్)

నవతెలంగాణ-జైనూర్

గ్రామాల్లోని సమస్యలను ముందుండి పరిష్కరించే కారోబార్ల జీవితాలు దుర్భరంగా మారాయి. ప్రభుత్వ పథకాల అమలుతో పాటు ప్రతి అభివృద్ధి పనిలో కారోబార్లది కీలకపాత్ర. 40 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులతో జీవితాన్ని గడుపుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు వీరి పరిస్థితి దయనీయంగా ఉండేది. స్వరాష్ట్రంలో తమ బ్రతుకులు మారుతాయని వారు ఆశించారు. కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. రెండోసారి అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 అక్టోబర్‌లో జీవో 51తో జీపీ కార్మికులకు మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని తీసుకొచ్చింది. పాత సిబ్బందిని కొనసాగిస్తూ జీపీల్లో ప్రతి 500 జనాభాకు ఒకరిని నియమించింది. జిల్లాలోని 15 మండలాల్లో సుమారు 325 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 300కు పైగా కారోబార్లు పనిచేస్తున్నారు. ఇంతకాలంగా విధులు నిర్వహించిన తమకు ఎలాంటి పదోన్నతులు, సీనియార్టీ లేకుండా పోయిందని గ్రామాల కారోబార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీఓ 51ని సవరించి, జీఓ 60 ప్రకవారం మున్సిపల్ సిబ్బందికి అందిస్తున్న రూ.19,500, క్రిందిస్థాయి సిబ్బందికి రూ.16,600 వేతనం అందించాలని ఎన్నో సంవత్సరాలుగా వారు డిమాండ్ చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, ఇంటి పన్నుల వసూళ్లు, ఎన్నికల విధుల్లో భాగంగా బీఎల్ఓలుగా పనిచేసినా సరైన గుర్తింపు లేదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఉద్యోగుల కొరతతో అన్ని పనులు చేయాల్సి వచ్చినా అదే వేతనం ఇస్తున్నారు. అటు అధికారులు, ఇటు పాలకుల అజమాయిషీతో కారోబార్లు మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రెగ్యులర్ చేయాలి

- సోము, మండల కార్యదర్శి



ఎన్నో ఎండ్లుగా పని చేస్తున్నాం. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో తాము ముందుండాల్సిందే. అలాంటి కారోబర్ల సమస్యల పరిష్కరంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. తామను గుర్తించి రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరిస్తుందనే ఆశతో ఉన్నాం.

ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం

- సోనేరావు, కారోబార్ల సంఘం జైనూర్ మండల అధ్యక్షుడు



ఏజెన్సీ ప్రాంతంలో గ్రామ పంచాయతీల వారీగా పనిచేస్తున్న కారోబార్లకు వేతనాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో అనేక మార్లు వినతిపత్రాలు అందజేసిన ఎలాంటి స్పందన లేదు. ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించి కారోబార్లకు నెల వేతనాలు అందించాలి. పాలకులు, అధికారులు తమపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలి.

కారోబార్లపై ప్రభుత్వం చిన్నచూపు

- శ్రీకాంత్, కారోబార్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



కారోబార్లు ఎన్నో కష్టాలు పడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. ప్రభుత్వం వారిని గుర్తించడంలేదు. ప్రభుత్వం పనులు చేపట్టడంలో కారోబార్ల వైపే మొగ్గు చూపుతుంది. కానీ వారికి వస్తున్న కష్టాలను మాత్రం తెలుసుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో సుమారు 300 మంది గ్రామ పంచాయతీల్లో కారోబార్లు విధులు నిర్వహిస్తున్నా కూడా ప్రభుత్వం నేటి వరకు వారిని రెగ్యులర్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుంది. వారు సెలవులు తీసుకున్నా కూడా వేతనాల్లో కోత విధిస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్యాయం జరిగింది. కనీసం నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ హయాంలోనైనా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. ఆరు నెలల నుండి కనీస వేనాలు ఇవ్వడం లేదు. కొన్ని మండలాల్లో సరైన సమయంలో వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుంది. కెరమెరి, ఆసిఫాబాద్ మండలాల్లో నాలుగు నెలల నుండి కారోబార్లకు వేతనాలు రావడంలేదు.

కందుల కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ మల్లికార్జున్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. సోమవారం మండలంలోని రౌట సంకెపెల్లి గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కందులను దళారులకు అమ్ముకొని మోసపోవద్దని, ప్రభుత్వం కొనుగోలు చేసిన కేంద్రాలలో కందులు విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు నేరుగా వారం రోజులలోపు వారి డబ్బులు వారి బ్యాంకు ఖాతాలో జమావుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ విమల, ఐకేపీ అధికారులు శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



నవతెలంగాణ-కౌటాల

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని డీఎల్‌పీఓ సురేష్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గృహజ్యోతి గ్యాస్ కనెక్షన్ దరఖాస్తుల పరిశీలనలో పాల్గొన్నారు. విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అధికారి ప్రశాంత్‌తో కలిసి దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సూచనలు చేశారు. మార్చి 31 లోపు వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని గ్రామపంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మౌనిక, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో గల ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయం నుండి మార్కండేయ స్వామి చిత్రపటంతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. మహిళలు ఏకరూప దుస్తులతో భక్తి పాటలతో కోలాటాలు ఆడడం ఆకర్షణీయంగా నిలిచింది. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉదయం ఆలయంలో గణపతి పూజ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు లింగయ్య, ధర్మయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్, సంజీవ్, మోహన్, మధుకర్, విజయ, సునీత, పుష్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని బీఎస్పీ నాయకులు కోరారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలుకపెల్లి శివారులోని సర్వేనెంబర్ 61, ఎల్లూరు శివారులోని 342లో రెవెన్యూ స్థలం ఉండగా నూతన మండలం ఏర్పడడంతో భూకబ్జా దారులు పెరిగిపోయారన్నారు. ప్రభుత్వ కనిపిస్తే కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించి కబ్జా చేయకుండా విచారణ జరిపి శాఖ, చట్ట పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మండల కేంద్రంలో క్రీడా మైదానం లేక యువకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూకబ్జా దారుల నుండి భూమిని కాపాడి క్రీడా మైదానం కోసం కేటాయించాలని విన్నవించారు. కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు భిట్టు శ్రీనివాస్, నాయకులు దేవాజీ, చందు, లచ్చన్న, గంగారాం, శంకర్‌గౌడ్, ఆశన్న పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలి

- కలెక్టర్ బొర్కడే హేమంత్



ప్రజావాణి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణి దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్‌తో కలిసి ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారులు చేసుకున్న దరఖాస్తుల పరిష్కారం, తిరస్కరణ వివరాలను సంబంధిత అర్జీదారుడికి లిఖితపూర్వకంగా తెలియపరచాలన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను ప్రతిరోజు నివేదిక అందించాలని, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను వారంలోగా పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికంగా భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు వస్తున్నాయని, మండల స్థాయిలో ఈ సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చూడాలన్నారు. మండల పరిధిలో లేని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ధరణి సంబంధించి వచ్చే దరఖాస్తులపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న వాటిపై వెంటనే పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో దరఖాస్తులు, ధరణిలో వచ్చే ఐచ్చికాలపై పూర్తిగా విచారణ జరిపి వాస్తవ నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకూడదని, వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

అర్జీలను స్వీకరించిన కలెక్టర్..

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అంతకు ముందు అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చే సమస్యల పరిష్కారం కోసం అధికారులు నిబద్ధతతో కృషి చేయాలన్నారు. మండల స్థాయిలో సమస్య పరిష్కారమయ్యే విధంగా చూడాలని సూచించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

తనిఖీల్లో పట్టుబడిన మద్యం



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ప్రొబీషన్ ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో మద్యాన్ని పట్టుకున్నారు. లారీ (ఏపీ 29 వై 9297)లో ఢిల్లీ నుండి ఆంధ్రప్రదేశ్‌కు షేక్ మహెమూద్ సుబానీ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 36 జానివాకర్ బ్లాక్‌లేబుల్ 750 ఎంఎల్ మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ మోసిన్ అలీ తెలిపారు. మద్యం, లారీని స్వాదీనం చేసుకొని షేక్ మహెమూద్ సుబానీపై కేసు నమోదుచేసినట్టు పేర్కొన్నారు.

రేపు పుల్వామ అమర జవాన్లకు నివాళి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పుల్వామ అమర జవాన్ల ఆత్మశాంతిని ఆకాంక్షిస్తూ ఇండియన్ మోక్షిత్ డాన్స్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు టౌన్ సీఐ శంకరయ్య కోరారు. సోమవారం రక్తదాన కరపత్రాలను సీఐ ఆవిష్కరించారు. అమరజవాన్లను స్మరిస్తూ బుధవారం ఉదయం విజేత ఆస్పత్రిలో రక్తదాన శిబిరం, సాయంత్రం అంబేద్కర్ చౌరస్తా నుంచి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు ఇండియన్ మోక్షిత డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టరులు డొంగ్రి సంతోష్, దుర్గం రాకేష్ తెలిపారు. సైనికులు ప్రాణాలను లెక్క చేయకుండ దేశాన్ని రక్షిస్తున్నారని తెలిపారు. జవాన్ల ఆత్మ శాంతికి నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

పది పరీక్షల పట్ల భయం పోగొట్టడమే లక్ష్యం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పది పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయం పోగొట్టడానికి టాలెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ తెలిపారు. ఈ నెల 18న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించే టాలెంట్ టెస్ట్ కరపత్రాలను జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మిడి భీమేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "అధ్యయనం-పోరాటం" అనే ఆచరణాత్మక నినాదాన్ని ముందుకు తీసుకెళ్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేలా ప్రోత్సహించడానికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కరం కోసం ఉద్యమిస్తు, విద్యార్థులకు అన్ని రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. త్వరలో జరుగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులకు సిద్ధం చేసేందుకు రాష్ట్రంలో ప్రముఖ విద్యావేత్తలు చుక్కా రామయ్య, డా, కె. నాగేశ్వర్‌తో నూతన సిలబస్ ఆధారంగా మల్టిపుల్ ఛాయిస్ రూపంలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ప్రశ్న రూపొందించామన్నారు. మరింత సమాచారం కోసం 9381046472, 88865 61367 నెంబర్‌లను సంప్రదించాలన్నారు. ఈనెల 16లోపు విద్యార్థులు సంబంధిత ప్రధాన ఉపాధ్యాయుల వద్ద నమోదు చేసుకోవాలని, 100 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుందన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందు కేంద్రానికి చేరుకోవాలని, పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో 10 ర్యాంకులకు, ప్రతీ మండలానికి 3 ర్యాంకులకు ప్రత్యేక బహుమతులు అందించనున్నట్లు వివరించారు. పదవ తరగతి విద్యార్థులు టాలెంట్ టెస్టుకు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అదే విధంగా కష్టపడి చదువుతు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆసిఫాబాద్ జిల్లాను ఫలితాల్లో టాప్ వన్‌లో ఉంచే విధంగా ప్రతి విద్యార్థి కృషి చేయాలని, ఉపాధ్యాయులు కూడా వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల రాష్ట్ర అధ్యక్షులు డి ఎల్లయ్య, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్ జాదవ్ సుభాష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వసాకే సాయి, కుమార్ ఉపాధ్యక్షులు సతీష్, జిల్లా కమిటీ సభ్యులు అయుబ్, భీమ్‌రావ్ పాల్గొన్నారు.

కల్వర్ట్, డ్రైనేజీ పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని కౌటగూడా గ్రామంలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్వర్టు, రూ. 2 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీకి జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పనులకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ రహదారులతో పాటు డ్రైనేజీల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు భీమన్న, లక్ష్మణ్, అంబరావు, రాపర్తి శంకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | ఫిబ్రవరి 13, 2024 | www.navatelangana.com

ఘనంగా భక్త మార్కండేయ జయంతి

నవతెలంగాణ-నస్పూర్



లక్ష్మి గణపతి శివ మార్కెండేయ దుర్గా మాత ఆలయంలో భక్త మార్కెండేయ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం జెండా ఆవిష్కరించి10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హన్మకొండ మాక్స్ విజన్ సూపర్ స్పెషలిటీ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో నస్పూర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు సిరిపురం రామన్న, ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్, కోశాధికారి కుసుమ శంకర్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలగాని బొడ్డయ్య, మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, ప్రధాన కార్యదర్శి వేముల సురేష్, కోశాధికారి చిప్ప రాజబాబు, ముఖ్య సలహాదారులు చిలువేరు శరవందం, చిలువేరు సదానందం పాల్గొన్నారు.

ఇసుక నిల్వను గుర్తించిన రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-జైపూర్



మండలం ముదిగుంట శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును గుర్తించినట్లు స్థానిక తహసీల్దార్ రమేష్ తెలిపారు. ముదిగుంట శివారు ఎల్లమ్మ దేవాలం సమీపంలో ఇసుక అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు ఇసుక డంపును గుర్తించినట్లు తెలిపారు. సుమారుగా 7 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక నిల్వను స్వాదీనపర్చుకుని మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

16న భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య



జన్నారంలో కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-జన్నారం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని, అంబేద్కర్ భవనంలో మగ్గిడి జయ అధ్యక్షతన సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలు ఎండగట్టాలని కోరారు. గత పది ఏండ్ల కాలంలో బీజేపీ అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాల ఫలితంగా ప్రజల జీవనం పూర్తిగా దిగజారిపోయిందని అన్నారు. ఆక్స్ ఫామ్ నివేదిక ప్రకారం దేశంలో 80 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని కొన్ని రాయితీలను ప్రకటిస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఈ మోసాలకు గురికాకుండా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. గతంలో మూడు వ్యవసాయ చట్టాలు రైతాంగానికి వ్యతిరేకంగా తేవడం జరిగిందని వాటికి వ్యతిరేకంగా పోరాడి ఆ చట్టాలను వెనక్కి తీసుకునే విధంగా పోరాటం చేశామని, అదే స్ఫూర్తి తోటి రైతు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనాలు, గిరిజన అటవీ హక్కుల చట్టాల రక్షణకు పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 16న జరిగే సమ్మెను అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం బందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికారపు అశోక్, మండల కమిటీ సభ్యులు కె.బుచ్చయ్య, కొండ గొర్ల లింగన్న, జయ, ప్రమీల, ఎస్కే అబ్దుల్లా, జి.అంకుల్, అంబటి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సింగరేణిలో దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

మందమర్రి: కార్మిక సంఘాలు ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని సీఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కేకే-5 గనిపై సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ సెక్రటరి నాగరాజ్ గోపాల్ మాట్లాడుతూ ఫిబ్రవరి 16న బీఎంఎస్ తప్ప మిగిలిన సంఘాలైన సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్ఎంఎస్ యూనియన్‌లు కలిసి దేశవ్యాప్తంగా చేస్తున్న సమ్మెకు మద్దతుగా సింగరేణిలో కార్మికులు సమ్మెలో పాల్గొన్నాని కోరారు. కోల్ ఇండియా, సింగరేణిలో సమ్మె కోసం సమ్మె నోటీసు ఇవ్వడానికి ముందుకు వచ్చిన సంఘాలు సింగరేణిలో మాత్రం కార్మికుల వద్దకు వచ్చి ప్రచారం చేయకుండా కొన్ని సంఘాలు ఏరియాలో తమ ఆఫీసులలో మాత్రమే సమ్మె ప్రచారం చేస్తున్న తీరును కార్మికులు గమనించాలని కోరారు. కార్మిక హక్కులను కాపాడాలన్న ఉద్దేశం ఏమాత్రం ఉన్నా గెలిచిన సంఘాలు బాధ్యత తీసుకొని సమ్మె చేస్తున్న అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా పబ్లిక్, ప్రయివేట్ సెక్టార్లలో కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్నారని కోల్ ఇండియాలో నడుస్తున్న బావులను వేలం పాటలు పెట్టినట్లు సింగరేణిలోనూ వేలం వేసే అవకాశం ఉన్నదని, భవిష్యత్తులో సీఎంపీఎఫ్ రికవరిను 12శాతం నుండి 10 శాతంకు తగ్గించే అవకాశం ఉందని, పని గంటలు పెంచేలా చట్టాలు మారుస్తున్నారని, చివరకు సమ్మె చేసుకునే హక్కులను సైతం కాలరాసే విధంగా చట్ట బద్ధతలేని కోడులను రూపొందిస్తున్నారని తెలిపారు. తాజాగా కార్మికులకు ఆదాయపన్ను స్లాబులలో మార్పులు చేయకుండా కార్పొరేట్లకు తక్కువ టాక్స్ వేసేలా స్లాబులు మార్చిన కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా కార్మిక వర్గం మొత్తం 16న జరిగే సమ్మెలో అన్ని జాతీయ సంఘాలతో పాటు ప్రాంతీయ సంఘామైన టీబీజీకేఎస్ సైతం భాగస్వామ్యం అవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు వెంకట్ స్వామి, అల్లి రాజేందర్ అసిస్టెంట్ కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్, ఆర్గనైజర్ భేతి భరత్ పాల్గొన్నారు.



సింగరేణి స్థలంలో వెలిసిన అక్రమ దుకాణం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలో సింగరేణి ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమ నిర్మాణాలు, దుకాణాలు అడ్డు అదుపు లేకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు చేస్తున్నారు. పట్టణంలోని స్థానిక ఆర్కే-4 గడ్డ ఖాళీ స్థలంలో ఈ అక్రమ దుకాణం వెలిసింది. ఈ దుకాణం సింగరేణి అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సింగరేణి, రెవిన్యూ స్థలాలపై ఇరువురు పట్టణంలోని స్థలాలపై మా డిపార్ట్మెంటుకు ఎటువంటి సంబంధం లేదని దాటవేయటంతో అక్రమార్కులు ఇదే అదునుగా నిర్మాణాలు చేపడుతూ సింగరేణి స్థలాలు విక్రయిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. జీవో 76ను అడ్డుపెట్టుకొని కొంతమంది పట్టాలు సైతం పొందుతున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. కనిపించిన కాలీ స్థలాలను స్థలాలలో రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపడుతున్నారు. సింగరేణి, రెవిన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే జీఓ 76, దుర్వినియోగం అవుతుందని, వెంటనే ఇటువంటి అక్రమ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు.

సమయ పాలన పాటించని అధికారులు



నవతెలంగాణ-వేమనపల్లి

మండల పరిషత్ కార్యలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం అధికారులు ఎవరు రాకపోవడంతో వెలవెల బోయింది. ప్రతి సోమవారం జిల్లా, మండల కేంద్రాల్లో ఉదయం 10:30 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి కాని మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలు దాటిన అధికారులు ఎవరూ ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాలేదు. ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, సమయపాలన పాటించాలని అధికారులకు సూచించినప్పటికీ మండలంలో పనిచేస్తున్న అన్ని శాఖల మండల అధికారులు ప్రభుత్వ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. ప్రజావాణికి దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు అధికారులు లేకపోవడంతో వెనుతిరిగి పోతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన మందపల్లి సత్యవ్వ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో, వారి కుటుంబానికి సోమవారం కిష్టాపూర్ గల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.18300, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ సంక్షేమ సమితి కిష్టాపూర్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడిపల్లి సంపత్ మాట్లాడుతూ సత్యవ్వ భర్త నరసయ్య వికలాంగుడు కావడంతో ఆ కుటుంబానికి సత్యవ్వనే పెద్దదిక్కుగా ఉండేదని ఆమె మృతితో ఆ కుటుంబం దీన పరిస్థితిని గుర్తించి సాయం అందజేశామని తెలిపారు. గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు చందాలు వేసుకొని వారికి ఈ సహాయాన్ని అందించారు. ఆర్థిక సాయం చేసినవారిలో అంకం మహేష్ సొన్నాయిల సాగర్, రాజన్న, రమేష్, నగేష్, రాము, లక్ష్మణ్, మహేష్, మల్లేష్, మురళి, కొల్లూరి రాజన్న, శంకర్, సతన్నా, బాపురావు, జగన్ ఉన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించండి

• ఎస్టీపీపీ జీఎంను కలిసిన కాంట్రాక్ట్ కార్మికులు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని జీఎం బసిరెడ్డిని యూనియన్ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం జీఎం కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నూతనంగా ఎన్నికైన ప్లాంట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ యూనియన్ నాయకులను పరిచయం చేసుకున్నారు. పవర్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నూతన కమిటీ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ తొగరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి దుస్సా భాస్కర్, అధ్యక్షుడు పాత శివకృష్ణ, మద్దూరి రాజు యాదవ్ తదితరులు జీఎంను శాలువాతో సన్మానించారు.

విద్యుత్ తీగలు అమర్చిన వారిపై కఠిన చర్యలు

• ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్

నవతెలంగాణ-కాసిపేట

వన్య ప్రాణుల కోసం విద్యుత్ తీగలు పెడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధించడం జరుగుతుందని ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిన్న అటవి ప్రాంతంలో విద్యుత్ తీగలు తగిలి ప్రవీణ్ అనే గ్రే హౌండ్స్ కానిస్టేబుల్ మరణించడం బాధాకరమని అన్నారు. వన్యప్రాణుల కోసం అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చడంతో విధులకు వెళ్లే అధికారుల ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అంతే కాకుండా మైదానం ప్రాంతంలో సైతం విద్యుత్ తీగలు అమర్చడంతో స్థానికులు, పశువులు కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పొతున్నారని పేర్కొన్నారు.

విధి నిన్వహణకు సహకరించిన వారికి కృతజ్ఞతలు



నవతెలంగాణ-జైపూర్

ఎంపీడీఓగా విధులు నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఎంపీడీఓ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఆయనకు సోమవారం మండల పరిషత్ కార్యాలయం సిబ్బందితో పాటు పలువురు రాజకీయ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్, తిరుపతి పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగస్తుల నిరసన

• నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గురుకుల ఉద్యోగస్తులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా బెల్లంపల్లి బాలుర గురుకులంలో ఉద్యోగస్తులు భోజన విరామ సమయంలో కళాశాల గేటు వద్ద ఎండలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముక్తకంఠంతో తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చూస్తూ నినాధాలు చేశారు. ప్రభుత్వం సానుభూతితో ఆలోచించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రమోషన్లు బదిలీలు తక్షణమే చేపట్టాలని ఖాళీల భర్తీకి నూతన నియమకాలు చేపట్టాలనికోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. గురుకుల ఉపాధ్యాయులకు ప్యారిటి స్కేల్‌ను వర్తింపచేయాలన్నారు. జీవో నెంబర్ 317 కు తక్షణమే పరిష్కారం చూపించాలని తెలిపారు. అన్ని గురుకుల సంస్థలను ఒకే యాజమాన్యం కిందికి తెచ్చి ప్రభుత్వం జీఓను తేవాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ రిక్రూట్మెంట్ ద్వారా నియమకం పొందిన వారికి పే, సర్వీస్ ప్రొటెక్షన్ అమలు చేయాలని అన్నారు. 2007లో రెగ్యులర్ అయిన ఉద్యోగస్తులు అందరికీ సంస్థలు జాయిన్ అయిన రోజు నుంచి సర్వీస్‌ను లెక్క కట్టి నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇస్తూ ఓపీఎస్ పరిధిలోకికు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. హాలిడే డ్యూటీస్‌కు ప్రత్యామ్నయంగా వీక్లీ ఆఫ్ ఇవ్వాలన్నారు.

టీఎన్‌జీఓ నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-హాజీపూర్

తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్‌జీఓ) ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఆ సంఘ భవనలో ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సంద అశోక్ తెలిపారు. అధ్యక్షులుగా గడియారం శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా భూముల రామ్మోహన్, అసోషియోట్ అధ్యక్షులుగా శ్రీపతి బాపు రావు, కోశాధికారిగా ఏ సతీష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బి.శ్రావణ్ కుమార్, పబ్లిసిటీ కార్యదర్శి ఎండీ యూసూప్‌తో పాటు నలుగురు ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రెటరీలు నలుగురుతో పాటు నలుగురు ఈసీ సభ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారి అశోక్ మాట్లాడుతు జిల్లా ఎన్నికలు సజావుగా, ఏక గ్రీవంగా సాగేందుకు సహకరించిన ప్రతి ఒక్క సభ్యునికి దన్యావాదాలను తెలిపారు. అనంతరం అధ్యక్షునిగా ఎన్నికైన శ్రీహరి మాట్లాడుతు జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ ఎన్నికలకు సహాయ ఎన్నికల అధికారిగా టీఎన్‌జీఓ కేంద్రం సంఘం ఫారెస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పొన్న మల్లయ్య వ్యహరించారు. ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను పూలమాల, శాలువాతో ఎన్నికల అధికారులు సన్మానించారు.



గనుల్లో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సింగరేణి సంస్థ సీఎండీ బలరాం నాయక్ ఆదేశామేరకు పట్టణ పరిధిలోని వివిధ గనులల్లో సోమవారం మల్టీ డిపార్ట్మెంట్ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ఓటూ జీఎం, కన్వీనర్ ఏ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్కే సీహెచ్‌పీ, ఆర్కే-1ఎ గనుల్లో సింగరేణి ఏరియా ఆస్పత్రి హెల్త్ డిపార్ట్మెంట్, సివిల్ ల్యాబ్, రీజినల్ డిపార్ట్మెంట్స్ ఉద్యోగస్తులందరికీ ఏరియా హాస్పిటల్‌లో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులతో కంపెనీ ఉత్పత్తి, భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులలో యంత్రాల వినియోగం సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ ఫైనాన్స్ విషయాలను చర్చించారు. కంపెనీ ముందున్న లక్ష్యాలను సవాళ్లను, పనులపై చర్చించారు. కార్మికులు నిబద్ధతతో తమకు కేటాయించిన పనులను చేయడం వలన అనుకున్న లక్ష్యాలను చేరడానికి తమ పనితనాన్ని మెరుగుపరచుకోవడం వలన లక్ష్యాలను చేరుకోవడం సులువుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఆంజనేయులు, ఆర్కే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, డీజీఎం ఐఈడీ పి.రాజన్న, డీవైపీఎం మైత్రేయ బంధు, డీవై జీఎంపీఎం సీహెచ్ పి.బాలాజీ భగవతి ఆర్కే-1ఏ గని మేనేజర్ జయంత్, ఏరియా హాస్పిటల్ డీవైసీఎం ఓ డాక్టర్ ఉష, సీఎం ఓఏఐ అధ్యక్షులు ప్రసన్న, ఆర్కేపీ సివిల్ ఎస్ఈ శ్రీధర్ పాల్గొన్నారు.

మందమర్రి : మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు నిర్వహించారు. సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ఆదేశానుసారం ఏరియా జీఎం మనోహర్ కమిటీ చైర్మన్, ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి కన్వీనర్ ఆధ్వర్యంలో సోమవారం జీఎం కార్యాలయంలో వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు, సివిల్ డిపార్ట్మెంట్, ఎంవీటీసీ ఉద్యోగస్తులకు మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశంలో కంపెనీ యొక్క ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను సాధించిన విజయాలను, భూగర్భ ఓపెన్ కాస్ట్ గనులలో యంత్రాల వినియోగం సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ, ఆర్థిక విషయాలపై చర్చించారు. కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలు ముందున్న సవాళ్లను లక్ష్యాలను సాధించడానికి చేయాల్సిన పనులపై చర్చించారు. ఉద్యోగులు కంపెనీకి సూచించిన సలహాలు సూచనలు పాటించడం వల్ల ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుందని అందరూ నిబద్ధతతో తమకు కేటాయించిన పనులను చేయడం వలన అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం సులువుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు ఏఐటీయూసీ నాయకులు, రవి జాయింట్ సెక్రటరీ సీఎంఓఏఐ, నాగరాజు ఏజీఎం ఈ అండ్ ఎం, రాజన్న డీజీఎం ఐఈడి, శ్రీనివాసులు డిజీఎం సివిల్, ఉజ్వల్ బంధోపాధ్యాయ ఏరియా సర్వే ఆఫీసర్, శంకర్ ఎంవీటీసీ మేనేజర్, రమణారెడ్డి ఫారెస్ట్ అధికారి, మైత్రేయ బందు డివై పీఎం పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 13, 2024 | www.navatelangana.com

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడికి ఆహ్వానం

నవతెలంగాణ-ఉట్నూర్



మండల కేంద్రంలోని కుమురంభీం కాంప్లెక్స్‌లో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కబాపూరావును గాంధారి ఖిల్లా మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగే గాంధారి ఖిల్లా మైసమ్మ మహా జాతరకు హాజరు కావాలని కోరారు. ఆహ్వానించిన వారిలో ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం, జిల్లా కమిటీ గాంధారిఖిల్లా మైసమ్మ ఆలయ కమిటీ, మంచిర్యాల జిల్లా ఆలయ కమిటీ చైర్మెన్ రొడ్డ రమేష్, వైస్ చైర్మెన్ దైనేని రమేష్ పాల్గొన్నారు.

ఇచ్చోడ సీఐగా బాధ్యతలు స్వీకరించిన భీమేష్

నవతెలంగాణ-ఇచ్చోడ



ఇచ్చోడ నూతన సీఐగా భీమేష్ సోమవారం ఇచ్చోడ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సీఐ బదిలీపై జిల్లా కేంద్రానికి వెళ్లడంతో ఆయన స్థానంలో సీఐ బీమేష్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజిలేకుండా పని చేస్తానని అన్నారు, బాధ్యతలు చేపట్టిన సీఐకి ఎస్సై, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : మంత్రి సీతక్క

నవతెలంగాణ-నార్నూర్

బాధిత కానిస్టేబుల్ ప్రవీణ్ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ఎస్పీ గౌస్‌ఆలం, కాంగ్రెస్ నాయకులు ఆజ్మీరా శ్యాం నాయక్, గరిబ్ వెల్ఫర్ సొసైటీ నాయకులు బానోత్ జగన్ నాయక్, వివిధ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేలకొరిగిన రబీ పంట

నవతెలంగాణ-కుభీర్



ఎన్నో ఆశలతో రైతన్నలు రబీలో సాగు చేసిన పంటలు ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో రైతు చేసిన కష్టం నేల పాలయ్యింది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం వడగండ్ల వాన బీభత్సం సృషించింది. మండలంలో ఆయా గ్రామాల్లో ఉన్న రైతులకు చేతికి వచ్చిన పంటలు మొక్కజొన్న కందులు, శనగలు గోదుమ తదితర పంటలు తీవ్రంగా నష్టపోయాయి. మొక్కజొన్న, జొన్న గోధుమ పంటలు పూర్తిగా నేలకొరిగాయి. కుప్పలుగా ఉంచిన కంది, శనగ, గోధుమ పంటలు తడిసి ముద్దయ్యాయి. ఈ ఏడాదిలో పంటలు బాగా పండి ఆర్థికంగా బాగుపడుతామనుకున్న రైతన్నల ఆశలు ఆడియాశలు అయ్యాయి. నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్అండ్‌పీసీ నూతన ఫిట్ కమిటీ ఏకగ్రీవం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెక్యూరిటీ ఫిట్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కేఎల్ మహేంద్రభవనంలో జరిగిన ఎన్నికలకు ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ భయ్యా మొగిళి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించి మాట్లాడుతూ సెక్యూరిటీ డిపార్టుమెంటులోని ప్రధాన సమస్యలైన సెక్యూరిటీ గార్డుల కొరత, కన్వీనెన్స్ సమస్యలు, నూతన సెంటర్ల ఆధునీకరణ, ఎన్-వన్ విధానం రద్దుకు కృషి చేస్తామన్నారు. గోలేటి ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ గార్డ్స్ ఇన్‌చార్జి త్రిశుల్ల రమేష్, డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా కందుల మల్లేష్, సహాయ కార్యదర్శిగా ఎస్‌కె జహెంగీర్, ఫిట్ ఇన్‌చార్జిలు ఎరిలే ముఖ్య రమేష్, బిరిలే మంజుల శ్రీనివాస్, సిసిరిలే గాండ్ల సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు డి రాజయ్య, ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, డిపార్ట్‌మెంట్ సిబ్బంది ముఖ్య రమేష్, రాజశేఖర్, సప్పన్ మండల్, సుమిత్రా, సంతోషిణి పాల్గొన్నారు.

16న కళాశాలలో జాబ్ డ్రైవ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 16న ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో డెవలప్‌మెంట్ మేనేజర్ పోస్టు కొరకు జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జలగం అనిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగానికి డిగ్రీ లేదా పీజీ చదివిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఆదిలాబాద్ పట్టణంలో పోస్టింగ్ ఉంటుందని, ఏడాదికి రూ.2.6లక్షల వేతనంతో పాటు ఇన్సెంటివ్ అలాగే లైఫ్ కవర్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ రెస్యూమ్ సర్టిఫికేట్ జీరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం పది గంటలకు తమ కళాశాలలో నిర్వహించే జాబ్ డ్రైవ్‌కు పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాల కొరకు చైతన్యకృష్ణ 9885762227 నెంబరును సంప్రదించాలని సూచించారు.

టీయూటీఎఫ్ మండల శాఖ ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని టీయూటీఎఫ్ సంఘ భవనంలో తలమడుగు మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ముస్కు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా రాథోడ్ బలిరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంద్రవెల్లి, జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ వ్యవహరించారు. నూతన మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలను, పదోన్నతులను చేపట్టాలన్నారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

గ్రామాలాభివృద్ధికి పెద్దపీట

నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని బిర్సాయిపేట్, కొత్తగూడ, నర్సాపూర్(బి) గ్రామాలలో సీసీ రోడ్లు, మురికి కాలువల పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, త్వరలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బదిలీ, సన్మానం చేసిన సిబ్బంది

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో పని చేసిన ఎంపీడీఓ కావల రమేష్ నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. నాలుగేండ్లుగా మండలంలోని ప్రజలకు మంచి సేవలు అందించారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఆయా మండలాల ఎంపీడీఓలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఎంపీడీఓ బదిలీపై వెళుతున్న సందర్భంగా సేవలను గుర్తు చేస్తూ కార్యాలయ సిబ్బంది, టీఏలు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో శాలువాతో సన్మానం చేశారు. కార్యాలయ సిబ్బంది రాజేంద్ర, టీఏలు సాదిక్ పాషా, జాదవ్ సచిన్, చౌహాన్ వికాస్, లావణ్య జ్యోతి ఉన్నారు.

ఖానాపూర్ ఎంపీడీఓ సస్పెన్షన్

నవతెలంగాణ-ఖానాపూర్

ఆసరా పెన్షన్లలో అక్రమాలపై ఎంపీడీవో బాలే మల్లేశంను సస్పెండ్ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2014-2015లో పెద్దపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఆసరా పెన్షన్లలో అక్రమాలు జరిగడంతో సస్పెండ్ అయినట్టు సమాచారం. సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పిఎస్.స్వామికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తున్నట్టు తెలిసింది.

ఐటీఐ కళాశాలలో పీఎం అప్రంటీషిప్ మేళా

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ప్రధాన మంత్రి నేషన్ అప్రెంటీషిప్ మేళాను నిర్వహించారు. ఈ మేళాకు వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన వారు 89 మంది హాజరవ్వగా 45 మంది ఎంపిక అయినట్టు కళాశాల ప్రిన్సిపాల్ దేవానంద్ తెలిపారు. హైదరాబాద్ నుండి ప్రీమియర్ సోలార్ కంపెని, కరీంనగర్ నుంచి ఆదర్శ ఆటోమోటివ్స్ కంపెనీలు హాజరయ్యాయి. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి ఎస్.సునిల్, శ్రీరాంపూర్ ట్రైనింగ్ అధికారి జగన్ మోహన్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు సాయితేజ, రాహుల్ కళాశాల స్టాఫ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారుల గైర్హాజరు

నవతెలంగాణ-జన్నారం

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు ఎవరూ రాకపోవడంతో ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చిన వారు వెనుతిరిగి పోయారు. కేవలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఒక్కరే ఉండటంతో ప్రజలు వెనుతిరిగి పోయారు.

జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలి

● క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఆదిలాబాద్ క్రీడాకారులు రాణించాలని డీసీసీబీ చైర్మెన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు అడ్డి బోజారెడ్డి అన్నారు. సోమవారం బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులకు బోజారెడ్డి దుస్తులను పంపిణీ చేశారు. 19వ ఇంటర్ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరగనుంది. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు డీసీసీబీ బ్యాంక్ తరపున క్రీడా దుస్తులను అందించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి మాట్లాడుతూ ఆయా క్రీడ రంగాల్లో జిల్లా క్రీడాకారులు రాణిస్తున్నారన్నారు. అథ్లెటిక్స్‌లో మరింత రాణించేలా అసోసియేషన్, బ్యాంక్ తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. అహ్మదాబాద్‌లో జరిగే 19వ ఇంటర్ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో క్రీడాకారులు సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రాజేష్, లిటిల్ స్టార్ ప్రిన్సిపల్ కమలాకర్‌రెడ్డి, కోచ్‌లు రాకేష్, జోయ్, సౌమ్య, రాహుల్ పాల్గొన్నారు.

అలేఖ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

● నిందితులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

ఉన్మాది చేతిలో దారుణ హత్యకు గురైన అలేఖ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నిందితులను కఠినంగా శిక్షించాలని, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, మాదిగ జాగృతి సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ నాతరీ రమేష్ అన్నారు. సోమవారం వారు అలేఖ్య కుటుంబ సభ్యులను ఆమె నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ ఈ దేశ ప్రజలకు నైతిక గ్రంథం, అది శాసనమని అంబేద్కర్ చెప్పిన మాటను గుర్తు చేస్తూ, అంత గొప్ప జీవన విధాన గ్రంధాన్ని అగ్రకుల పాలకులు ప్రజల్లో ప్రచారం చేయక ఇలాంటి దాడులు, సంఘ విద్రోహక కార్యక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. నిందితుడిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, వెంటనే కఠినమైన శిక్ష వేయడంతో పాటు బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, ఇంటిలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అందరం బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అంతకుముందు అలేఖ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు షేక్ జాఫర్ అహ్మద్, అంజయ్య, సుధాకర్, రాజు మహారాజ్, సుధాకర్, భూమేష్, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు హరిప్రసాద్, ముత్యం, మాదిగ జాగృతి సంఘం నాయకులు అంజయ్య మహారాజ్, రాజు మహారాజ్ ఉన్నారు.

అధికారులు సేవలతో ప్రజల గుండెల్లో నిలవాలి



నవతెలంగాణ-తలమడుగు

ఏ ఉద్యోగం చేస్తున్నమన్నది కాదని, కిందిస్థాయి అయినా పైస్థాయి అయినా న్యాయబద్ధంగా చేసి ప్రజల గుండెల్లో నిలవాలని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. బదిలీపై వెళ్తున్న రమాకాంత్‌కు సోమవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ, పదోన్నతులు సర్వసాధారణమన్నారు. ఉద్యోగ బాధ్యతల్లో తమవంతుగా ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని తెలిపారు. మండల నాయకులు, ప్రజలు ఎలాంటి కల్మషం లేని వారని తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. శాఖపరమైన తెలియని ఎన్నో విషయాలు తెలిపేవారని, అందరినీ సమానం చేసే వారని ఈ సందర్భంగా సిబ్బంది గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల సిబ్బంది జమీల్, నగేష్, ఉమ, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన



నవతెలంగాణ-బోథ్

మండలంలోని పట్నాపూర్ గ్రామ ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీపుల్స్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం విషయ నిపుణులు సదానందం, రమేష్ బాబు, అడెపు నరేష్‌తో పాటు ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయికృష్ణ, రమణగౌడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అపోహలు, సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఒత్తిడికి గురికాకుండా ఉండడానికి పాటించాల్సిన నియమాలను వివరించారు. పరీక్షలకు ముందున్న సమయాన్ని విద్యార్థులు ఏవిధంగా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మెస్రం రాములు, న్యాయవాది పంద్రం శంకర్, వ్యవసాయ విస్తరణ అధికారి కొట్టూరి శ్యామ్, సొసైటీ సభ్యులు కార్తీక్, అనిల్ మాసం, కుషాల్, రోహిత్ పాల్గొన్నారు.

వారసంతలో తాగునీటి సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని వారసంతలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని సోమవారం ఎంపీడీవో సుశీల్‌రెడ్డికి బీజేపి నాయకుడు జక్కుల వెంకటేష్ వినతిపత్రం అందజేశాడు. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతలో సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంకటేష్ తెలిపారు. పశువులు తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

సీఐగా సాయినాథ్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-జైనథ్

సీఐగా సోమవారం డి.సాయినాథ్ బాధ్యతలు స్వీకరించారు. పెన్‌గంగ పరివాహక ప్రాంతాలైన పెండల్వాడ, సాంగ్వి తదితర గ్రామాలలో ఎస్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల ద్వారా విపత్తు నిర్వహణ జాగ్రత్తల గురించి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పురుషోత్తం, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

నవతెలంగాణ-సిరికొండ

అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు ఒరగంటి పెంటన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ హోదా లేకున్నా కాంగ్రెస్ నాయకుడు ఆడే గజేందర్ సిసి రోడ్డు పనులను ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కంటే ఎక్కువ నిధులు తెచ్చానని గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలని తెలిపారు. ఎటువంటి పదవి లేకుండా నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తాడని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుబంధు నిధులు వేయకుండా రైతులను మోసం చేస్తోందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఇక్బాల్, లతీఫ్, సూర్యకాంత్, తులసీదాస్, భీంరావ్, ఆనంద్‌రావ్, రోహిదాస్, నర్సిములు, మల్లేష్ పాల్గొన్నారు.

జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ బదిలీ

నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జడ్పీసీఈఓ నరేందర్ పెద్దపల్లికి, డీఆర్‌డీఓ శేషాద్రి రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఆదిలాబాద్ జడ్పీ సీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న గణపతి మంచిర్యాలకు బదిలీపై రానున్నారు. ఆదిలాబాద్ డీఆర్‌డీఓ కిషన్ మంచిర్యాలకు బదిలీపై రానున్నారు.

సింగరేణి జీఎంను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డిని సోమవారం ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కలిశారు. జీఎం కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. జీఎంను కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామగిరి రాము మాదిగ, ప్రధాన కార్యదర్శి నిట్టూరి ప్రశాంత్ మాదిగ, ప్రచార కార్యదర్శి తుంగపిండి లక్ష్మణ్ మాదిగ, రాకేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ నాయకుడు రామగిరి అభిరామ్ మాదిగ ఉన్నారు.